## కొత్తవాడలో వాహనాల తొలగింపు

**'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన**


పార్కింగ్ చేసిన వాహనాలను తొలగిస్తున్న యజమానులు

పోచమ్మమైదాన్, మే 12 : వరంగల్ కొత్తవాడలో రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాలను తొలగించారు. అలాగే, అసాంఘిక శక్తుల బెడద లేకుండా చేస్తామని పోలీసులు స్థానికులకు భరోసా కల్పించారు. నమస్తే తెలంగాణ దినపత్రికలో 'అసాంఘిక శక్తులకు అడ్డాగా రోడ్డుపై గుర్తు తెలియని వాహనాలు' అనే శీర్షికతో సోమవారం కథనం ప్రచురితమైంది. దీంతో మట్టెవాడ పోలీసులు స్పందించారు. ఉదయమే కొత్తవాడలోని ఏకశిలా కాలేజీ వెనుక పార్కింగ్ చేసి ఉన్న వాహనాలను తొలగించాలని సంబంధిత యజమానులకు ఫోన్ ద్వారా సూచించారు. దీంతో మధ్యాహ్నం వారు వచ్చి నెలల తరబడి పార్కింగ్ చేసిన వాహనాలను తీసుకెళ్లారు. అలాగే, ఈ ప్రాంతంలో అసాంఘిక శక్తుల బెడద లేకుండా రోజు పెట్రోలింగ్ చేస్తామని స్థానికులకు పోలీసులు భరోసా కల్పించారు. అసాంఘిక కార్యక్రమాలపై వెంటనే సమాచారం అందించాలని సూచించారు. నమస్తే కథనానికి స్పందించి, వెంటనే చర్యలు తీసుకున్న పోలీసులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## రెక్కల కష్టం బుగ్గిపాలు

**పొలంలో షార్ట్ సర్క్యూట్‌తో 100 బస్తాల వరి ధాన్యం దగ్ధం**


కాలిపోయిన ధాన్యాన్ని ఎత్తుతున్న బాధితులు

నర్సంపేట, మే 12 : పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి వరి ధాన్యం దగ్ధమైన ఘటన మండలంలోని చంద్రయ్యపల్లిలో చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుక్కమూడి భిక్షపతి తనకున్న రెండున్నర ఎకరాల పొలంలో వరి సాగు చేశాడు. యాసంగి పంటను పంట కోత పూర్తి చేసి, పొలంలోనే అమ్మకం కోసం సిద్ధంగా ఉంచాడు. అయితే, శనివారం సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ షార్ట్ సర్క్యూట్‌కు గురికాగా, పక్కనే ఉన్న వరిగడ్డికి మంటలు అంటున్నాయి. అవి వ్యాపించగా పొలంలోని ధాన్యం దగ్ధమైంది. దీంతో సుమారు 100 బస్తాల ధాన్యం కాలిబూడిదైందని, రూ.1.5లక్షల నష్టం వాటిల్లిందని రైతు భిక్షపతి తెలిపాడు. అలాగే, గడ్డి కట్టలు, పైపులు, వైర్లు కూడా కాలిపోయాయని చెప్పాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు. ఈ ఘటనపై పోలీసు, వ్యవసాయ, రెవెన్యూ అధికారులకు వేర్వేరుగా ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపారు.

## బాధిత కుటుంబానికి బీఆర్‌ఎస్ నాయకుల పరామర్శ


అంతిమ యాత్రలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు

రాయపర్తి, మే 12 : మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పీఏగా పనిచేస్తున్న కొలన్‌పాక పరమేశ్వర్ తండ్రి కొలన్‌పాక సిద్ధులు సోమవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మునావత్ నర్సింహనాయక్ సారథ్యంలో పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు జనగామ జిల్లా వడ్లకొండ గ్రామానికి చేరుకుని సిద్ధులు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంతియ యాత్రలో పాల్గొన్నారు. నాయకులు లేతాకుల రంగారెడ్డి, పూస మధు, భూక్యా సురేందర్‌రాథోడ్, తాళ్లపల్లి సంతోష్‌గౌడ్, ఆశ్రప్‌పాష, ఉబ్బని సింహాద్రి, కోల సంపత్, మహ్మద్ యూసఫ్, సంకినేని ఎల్లస్వామి, కొమ్ము రాజు, చిలువేరు సాయిగౌడ్ ఉన్నారు.

## ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారం


విద్యార్థులను సత్కరిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

కరీమాబాద్, మే 12 : పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, సివిల్ సర్వీస్, ఎంబీబీఎస్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆర్యవైశ్య విద్యార్థులను వరంగల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో శాంతినగర్‌లో సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్యవైశ్య విద్యార్థులకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. వ్యాపారవేత్త బజ్జూరి పూర్ణచందర్ విద్యార్థులకు రూ.1116 చొప్పున నగదు అందజేశారు. రాష్ట్ర కార్యదర్శి వంగవీటి అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి గార్లపాటి నాగేంద్రబాబు, గందె శ్రీనివాస్, నాయకులు మంచాల కృష్ణమూర్తి, సొల్లేటి కళావతి, యాద రవికుమార్, పుల్లూరి రఘు, శ్రీరామ్ శ్రీనివాస్, అల్లాడి వీరభద్రయ్య, శ్రీరామ్ రవీందర్, పల్లా పరమేశ్వర్, తాటిపల్లి ప్రవీణ్, మిత్తింటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

**మండల టాపర్ మర్రి రక్షితకు..**

రాయపర్తి : పదో తరగతి ఫలితాల్లో మండల టాపర్ మర్రి రక్షితను హనుమాండ్ల ఝాన్సీరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి సత్కరించారు. స్థానిక జడ్పీఎస్ఎస్‌లో చదివిన మర్రి రక్షిత 550 మార్కులతో టాపర్‌గా నిలిచింది. దీంతో కొడకండ్లలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినిని అభినందించారు. హెచ్‌ఎం గారె కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బైండోవర్ ఉల్లంఘించిన ఇద్దరికి జైలు

చెన్నారావుపేట, మే 12: బైండోవర్ ఉల్లంఘించిన ఇద్దరు మహిళలకు జైలు శిక్ష విధించినట్లు నర్సంపేట ఎక్సైజ్ సీఐ నరేశ్‌రెడ్డి సోమవారం తెలిపారు. మండలంలో నాటు సారా నిర్మూలన కోసం జరిపిన దాడుల్లో పట్టుబడిన టీకే తండాకు చెందిన తేజావత్ కట్టమ్మ, తేజావత్ మన్నిలను గతంలో చెన్నారావుపేట తహసీల్దార్ ఫణికుమార్ ఎదుట బైండోవర్ చేసినప్పటికీ వారి ప్రవర్తనలో మార్పు రాకుండా తిరిగి సారా అమ్ముతూ పట్టుబడ్డారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి, తహసీల్దార్ ఆదేశాల మేరకు నర్సంపేట మహిళా జైలులో రిమాండ్ చేసినట్లు తెలిపారు. దాడులలో ఎక్సైజ్ ఎస్సై శార్వాని, సిబ్బంది పాల్గొన్నారు.

## పొగాకు ఉత్పత్తుల పట్టివేత

కరీమాబాద్, మే 12 : పెట్రోలింగ్‌లో భాగంగా ప్రభుత్వ నిషేధిత పొగాకు ఉత్పత్తులను సోమవారం పట్టుకున్నట్లు మిల్స్‌కాలనీ పోలీసులు తెలిపారు. ఖిలావరంగల్‌లోని రెండు చోట్ల ప్రభుత్వ నిషేధిత ఉత్పత్తుల అమ్మకాలను చేపడుతున్న ఇద్దరిపై కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి రూ.14,400 విలువ గల పొగాకు ఉత్పత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

# రేపు కోటకు విశ్వ సుందరీమణులు

**ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్లు, సీపీ**

ఖిలావరంగల్, మే 12 : చారిత్రక ఓరుగల్లు కోటను బుధవారం విశ్వ సుందరీమణులు సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలో కోటలోని ఏర్పాట్లను వరంగల్, హనుమకొండ కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, ప్రావీణ్య, వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ సోమవారం పరిశీలించారు. సౌండ్ అండ్ లైట్స్ షో, సాంస్కృతిక ప్రదర్శనలు, మీడియా పాయింట్ ఏర్పాట్లపై చర్చించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విశ్వ సుందరీమణులు ఖిలావరంగల్‌కు సాయంత్రం 6.40 గంటలకు చేరుకొని చారిత్రక విశిష్టతలను తెలుసుకుంటారన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణి, హనుమకొండ డీఆర్వో వైవీ గణేశ్ పాల్గొన్నారు. అలాగే, చారిత్రక ఓరుగల్లు కోటలో కీర్తితోరణాల ప్రాంగణంలోని శిల్పాలపై పేరుకుపోయిన దుమ్ము ధూళిని పురావస్తు శాఖ సిబ్బంది తొలగించారు. వాటిని నీటితో శుభ్రం చేశారు. దీంతో కాకతీయుల శిల్ప కళాఖండాలు కొత్త అందాలను సంతరించుకున్నాయి. అలాగే, కోట ప్రధాన రహదారులను ముస్తాబు చేసి, రంగురంగుల లైట్లను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఖిల్లాను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకొన్నారు.


కోటలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద తదితరులు

**నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలి**

వరంగల్ : వరంగల్ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే అన్నారు. మిస్ వరల్డ్-2025 సుందరీమణులు నగర పర్యటనకు వస్తున్న నేపథ్యంలో వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో పారిశుధ్యం, హార్టికల్చర్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బుధవారం సుందరీమణులు వస్తున్న తరుణంలో నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రధాన కూడళ్లు ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సూచించారు. గ్లోబల్ స్థాయిలో పచ్చదనం, పరిశుభ్రత ఉట్టిపడేలా చేయాలన్నారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌వో రాజారెడ్డి, హెచ్‌వోలు రమేశ్, లక్ష్మారెడ్డి, ఎంహెచ్‌వో రాజేశ్, శానిటరీ సూపర్‌వైజర్ సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

## శభాష్... పోలీస్ !

- గవిచర్లలో మక్కజొన్న చేనుకు మంటలు
- ధైర్యంతో మంటలను ఆర్పిన కానిస్టేబుళ్లు


కుమారస్వామి, అమీర్‌బాబా

సంగెం, మే 12 : మక్కజొన్న చేనుకు మంటలు అంటుకోగా ధైర్యంతో వాటిని ఆర్పిన పోలీసులను గ్రామస్తులు అభినందించారు. మండలంలోని గవిచర్ల గ్రామానికి చెందిన మద్దూరి వెంకటయ్య మక్కజొన్న చేనులో ఆదివారం రాత్రి ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించాయి. దీంతో రైతు వెంకటయ్య వెంటనే 100 డయల్‌కు కాల్ చేసి విషయాన్ని చెప్పారు. దీంతో కానిస్టేబుళ్లు కుమారస్వామి, అమీర్‌బాబా హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకోగా అప్పుడే చేనులో మంటలు వ్యాపిస్తున్నాయి. దీంతో ఇద్దరు మంటలు వ్యాపించకుండా పచ్చి పొరకను తీసి కొట్టుకుంటూ పోయారు. ఇలా అరగంట పాటు వీరు ధైర్యంతో ముందుకు వెళ్లి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా మక్కజొన్న చేన్లో మంటలను ఆర్పివేసిన కానిస్టేబుళ్లు కుమారస్వామి, అమీర్‌బాబాలను గ్రామస్తులు, పోలీసు అధికారులు అభినందించారు.

## ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య

నర్సంపేట, మే12 : అనారోగ్యం, ఒంటరితనం తాళలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. మండలంలోని దాసరిపల్లి గ్రామానికి చెందిన పోతరాజు చేరాలు(55)-కొమురమ్మ దంపతులకు ఇద్దరు సంతానం. కొమురమ్మ మూడేళ్ల క్రితం మృతి చెందింది. పిల్లలకు వివాహాలు జరిగి వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నారు. చేరాలు కొంత కాలంగా ఒంటరిగా ఉంటూ అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో తీవ్ర మానసిక వేదనకు గురై సోమవారం ఇంట్లో దూలానికి ఉరి వేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

**ఎస్ఆర్ఆర్‌తోటలో మరొకరు..**

కరీమాబాద్ : మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్ఆర్ఆర్‌తోటలో రవికుమార్(60) అనారోగ్యంతో మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## వివాహిత అదృశ్యం

నర్సంపేట, మే12 : వివాహిత అదృశ్యమైన ఘటన కమ్మపల్లి పంచాయతీ పరిధి చక్రంతండాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చక్రంతండాకు చెందిన అజ్మీరా మౌనిక-రాజేందర్ దంపతులు స్థానికంగా వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ నెల 11న ఉదయం పని నిమిత్తం మౌనిక నర్సంపేటకు వచ్చింది. సాయంత్రం ఇంటికి తిరిగి రాకపోయే సరికి కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లల్లో వెతికారు. అయినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో భర్త రాజేందర్ సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై గూడ అరుణ్‌కుమార్ తెలిపారు.

## విద్యుత్ ప్రజావాణి

హనుమకొండ, మే 12 : ప్రతి సోమవారం సర్కిల్ పరిధిలోని సర్కిల్, డివిజన్ ఆఫీస్, ఈఆర్వో, సబ్ డివిజన్ ఆఫీస్, సెక్షన్ ఆఫీసుల్లో విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వరంగల్ సర్కిల్ ఎస్ఈ కే గౌతమ్‌రెడ్డి తెలిపారు. వినియోగదారులందరికీ చేరువై వారి సమస్యల పరిష్కారానికే దీన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు విద్యుత్ ప్రజావాణిలో 849 ఫిర్యాదులు రాగా, 748 పరిష్కరించామని చెప్పారు. ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు, సర్కిల్ ఆఫీస్‌లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

## గురిజాల విద్యార్థినికి అమెరికాలో మాస్టర్ డిగ్రీ


గజ్జి సాయివర్ష

నర్సంపేట, మే 12 : గురిజాల గ్రామానికి చెందిన విద్యార్థిని గజ్జి సాయివర్ష అమెరికా డల్లాస్‌లో మాస్టర్ డిగ్రీ పట్టా అందుకుంది. గ్రామానికి చెందిన గజ్జి శ్రీనివాస్-కవిత దంపతుల చిన్న కూతురు సాయివర్ష అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్‌లో రెండేళ్ల పాటు అడ్వాన్స్‌డ్ డాటా అనాలిటిక్స్ కోర్సులో విద్యనభ్యసించి మాస్టర్ (ఎంఎస్) డిగ్రీ పట్టాను అందుకుంది. దీంతో ఆమెను గ్రామస్తులు, పెద్దలు అభినందించారు.

## ఓంకార్ శతజయంతి వేడుకలు

గీసుగొండ, మే 12 : మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ శత జయంతి వేడుకలు సోమవారం రాత్రి హర్జ్యాతండాలోని ఓంకార్ స్తూపం వద్ద ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఓంకార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంసీపీఐయూ జాతీయ కార్యదర్శి మద్దికాయల అశోక్, రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, కుమారస్వామి, రమేశ్, రాజు, నాగభూషణం, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఫలించిన పెద్ది సుదర్శన్‌రెడ్డి కృషి

- ప్రారంభమైన బ్రిడ్జి నిర్మాణ పనులు
- నెరవేరనున్న చెన్నారావుపేట ప్రజల దశాబ్దాల నాటి కల


కేసీఆర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చెన్నారావుపేట, మే 12 : మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శర్‌రెడ్డి నాడు చేసిన కృషికి నేడు ఫలితం కనిపిస్తున్నదని బీఆర్ఎస్ మండల నాయకుడు బాల్నె వెంకన్న అన్నారు. చెన్నారావుపేట మండల కేంద్రం శివారులో ప్రవహిస్తున్న పాకాల వాగుపై చెక్ డ్యాం కమ్ బ్రిడ్జి పనులను కాంట్రాక్టర్ ఇటీవల ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక బీఆర్ఎస్ నాయకులు సోమవారం బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఈ బ్రిడ్జి నిర్మాణం కోసం మాజీ ఎమ్మెల్యే పెద్ది చేసిన కృషిని వారు గుర్తు చేశారు. ఈ సందర్భంగా బాల్నె వెంకన్న మాట్లాడుతూ ప్రత్యేక జీవో ద్వారా రూ.32.78 కోట్లతో పాకాల వాగుపై మూడు చోట్ల బ్రిడ్జి, చెక్‌డ్యాంల నిర్మాణానికి అప్పట్లో పెద్ది సుదర్శన్‌రెడ్డి అనుమతులు సాధించారని తెలిపారు. వ్యవసాయ, వ్యాపార పనుల నిమిత్తం చెన్నారావుపేట నుంచి ఖానాపురం వెళ్లే రైతులు, ఇతరులు మున్నేరు వాగు దాటలేక అనేక ఇబ్బందులు పడేవారని తెలిపారు. నాడు అసాధ్యం అనుకున్న బ్రిడ్జి నిర్మాణాన్ని మొండి పట్టుదలతో అన్ని శాఖలను ఒప్పించి పెద్ది సుసాధ్యం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా 18 నెలలు ఆలస్యంగా పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. ఇప్పటికైనా నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి రెండు మండలాల ప్రజల సమస్యలను తీర్చాలని కోరారు. ఈ ప్రాంత ప్రజల ఆశీస్సులతో పెద్ది సుదర్శర్‌రెడ్డి ఒకేసారి ఎమ్మెల్యేగా గెలిచినా మండలంలో అనేక అభివృద్ధి పనులు చేసి చూపించారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జక్క అశోక్, మండల యూత్ ఇన్‌చార్జి కంది కృష్ణచైతన్యరెడ్డి, మాజీ సర్పంచ్ కుండె మల్లయ్య, కోఆప్షన్ మాజీ సభ్యులు రఫీ, గ్రామ అధ్యక్షుడు సాంబయ్య, నాయకులు కొండవీటి ప్రదీప్, గఫ్ఫార్, మూడు రమేశ్, బోడ మురళీనాయక్, ములుక సాంబయ్య, కృష్ణయ్య, కిషన్, రమేశ్ పాల్గొన్నారు.

# గ్రామాల్లో తాగునీటికి కటకట

**నిలిచిపోయిన మిషన్ భగీరథ నీరు**


ఉప్పరపల్లిలో ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు

వర్ధన్నపేట, మే 12 : వారం రోజులుగా మండలంలో తాగు నీటి సమస్య వస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా విద్యుత్ సమస్య కారణంగా నిలిచిపోయింది. దీంతో గ్రామాలకు ఐదు రోజులుగా నీటి సరఫరా అంతంతమాత్రంగా జరుగుతున్నది. గ్రామాల్లోని బోరు బావుల ద్వారా ట్యాంకులకు ఎక్కించి సిబ్బంది నీటిని సరఫరా చేస్తున్నారు. కానీ భూగర్భ జలాలు అడుగంటడంతో పాటు విద్యుత్ సరఫరాలో కూడా అంతరాయాలు ఏర్పడుతుండడంతో సరఫరా జరుగడం లేదు. మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామాలకు నీరు అందడం లేదు. నీరు పూర్తిగా అడుగంటిన గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని అందించే పరిస్థితి నెలకొంది. మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో నాలుగు రోజులుగా పంచాయతీ సిబ్బంది వాటర్ ట్యాంకర్ ద్వారా గ్రామస్తులకు నీటిని అందిస్తున్నారు. వెంటనే జిల్లా అధికారులు స్పందించి మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నర్సంపేట, మే 12 : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంఈవో కొర్ర సారయ్య అన్నారు. సోమవారం జన విజ్ఞాన వేదిక వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో భవానీ మహిళా పరస్పర సహకార సంఘం సమక్షంలో ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మహిళా చైతన్యం, సమాజంలో పేరుకుపోయిన మూఢనమ్మకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో సారయ్య మాట్లాడుతూ మూఢనమ్మకాలను నిర్మూలించగలిగే శక్తి మహిళలకు మాత్రమే ఉందన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా జనరల్ సెక్రటరీ గుగులోత్ సుధాకర్, గౌరవ అధ్యక్షుడు పెండెం భాస్కర్, మండల ప్రధాన కార్యదర్శి బూర్గు నవీన్‌కుమార్, లీడ్ లైబ్రరీ వ్యవస్థాపకుడు కాసుల రవికుమార్, కరాటే మాస్టర్ రచ్చ శ్రీనివాస్, డ్రాయింగ్ మాస్టర్ కిష్టయ్య, ఉపాధ్యాయులు గోపాల్, సురేశ్, మహిళా సంఘం అధ్యక్షురాలు పోగు రమ, తౌటి విజయ పాల్గొన్నారు.

## జలదాన కేంద్రం ప్రారంభం

ఖిలావరంగల్, మే 12 : వరంగల్ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో వాక్ సమైక్య ఫౌండేషన్ డాక్టర్ వన్నాల వెంకటరమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జలదాన కేంద్రాన్ని అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు సోమవారం ప్రారంభించారు. 18 ఏళ్లుగా బాటసారుల కోసం మజ్జిగ, తాగునీటిని అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సముద్రాల పరమేశ్వర్, రత్నం సతీశ్, మాచర్ల దీన్‌దయాళ్, మైదం సుదర్శన్, వెనిశెట్టి రోహిత్ పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు అప్పగింత

ఖిలావరంగల్, మే 12 : వరంగల్ రైల్వే స్టేషన్ పరిధిలో ప్రయాణికులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను రికవరీ చేసి, బాధితులకు అప్పగించినట్లు జీఆర్పీ సీఐ సురేందర్ తెలిపారు. రూ.1.20లక్షల విలువ కలిగిన ఆరు మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి, స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. స్టేషన్ పరిధిలో ఎవరైనా మొబైల్ పోగొట్టుకుంటే ఫిర్యాదు చేయాలని సూచించారు.


## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

గీసుగొండ, మే 12 : మండలంలోని చింతలపల్లి స్టేషన్‌లో కిష్టాపురం గౌతమ్ కృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా బాధిత కుటుంబానికి సోమవారం లక్ష్మీ గణపతి పరపతి సంఘం సభ్యులు పరామర్శించారు. మృతుడి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి, రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల పడిగాపులు

వర్ధన్నపేట, మే 12 : మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో నెల రోజులుగా కాంటాలు కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్వాహకులను ఎంత బతిమాలినా కూడా కాంటా వేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. వర్షానికి ధాన్యం తడిసి మొలకెత్తేలా ఉందని ఆందోళన చెందుతున్నారు. తహసీల్దార్‌కు కూడా తమ ఇబ్బందిని చెప్పినా కూడా ఎలాంటి ఫలితం లేకుండా పోతున్నదని రైతులు చెబుతున్నారు.


**నెలరోజులైనా కాంటాలు లేవు**



నెల క్రితం వరి ధాన్యాన్ని వర్ధన్నపేట ఫిరంగిగడ్డకు చెందిన కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన. ఇంత వరకు నాకు నిర్వాహకులు బస్తాలు ఇస్తలేరు. కాంటా పెడుతలేరు. మూడు రోజుల క్రితం పిడుగు పడి నా దగ్గర పనిచేసే యువకుడికి తీవ్ర గాయాలు కావడంతో దవాఖానలో చికిత్స చేయిస్తున్నా. ఈ విషయం వారికి చెప్పి, ధాన్యం తూకం వేయాలని బతిమిలాడినా కూడా కనికరించడం లేదు. విషయాన్ని తహసీల్దార్‌కు కూడా చెప్పినా. అయినా నా వద్దు కాంటా పెడుతలేరు.

– శివరాత్రి తిరుపతి, వర్ధన్నపేట

**తడిసి మొలకెత్తుతానై**



మూడు రోజుల క్రితం కురిసిన వర్షానికి నా ధాన్యం తడిసింది. రోజు వడ్లను తిరగబోత్తాన. అయినా కూడా మొలకెత్తుతానై. 20 రోజుల కింద ఫిరంగిగడ్డ కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన. ఇంత వరకు కాంటా వేయలేదు. కేవలం పలుకుబడి ఉన్నోళ్లయి, వారికి దగ్గరొల్లయే కాంటా పెడుతాండ్లు. నేను 9 ఎకరాల భూమి కౌలుకు తీసుకొని పంట వేసుకున్న. ధాన్యం అమ్ముకునేందుకు ఇంత ఇబ్బంది ఎప్పుడూ పడలేదు. కాంటా ఎప్పుడైతదో కూడా తెలుస్తలేదు.

– సోమ చంద్రయ్య, కౌలు రైతు, వర్ధన్నపేట

## ఇండ్లు కోల్పోయాం.. దయ చూపండి

**కలెక్టర్‌కు దమ్మన్నపేట వాసుల వినతి**

వర్ధన్నపేట, మే 12 : రోడ్డు వెడల్పులో ఇండ్లు కోల్పోయి ఏండ్లు గడుస్తున్నా తమను ఎవరూ పట్టించుకోవడం లేదని మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన బాధితులు సోమవారం కలెక్టర్ సత్య శారదకు విన్నవించారు. భూ భారతి సదస్సులో భాగంగా కలెక్టర్ ఇతర అధికారులతో కలిసి దమ్మన్నపేట గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను ఇండ్లు కోల్పోయిన బాధితులు కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామం మధ్య నుంచి వేసిన సీసీ రోడ్డు కోసం సుమారు 20 మంది పేదల ఇండ్లను అధికారులు కూల్చివేశారని, కానీ వారికి ఇంత వరకూ ఎలాంటి పరిహారం అందించలేదన్నారు. ఇప్పటికీ సగం కూలిన భవనాలు, పూరిళ్లలోనే కాలం వెళ్లదీస్తున్నామని పూజారి వజ్రమ్మ, మేరా ఉప్పమ్మ, పిన్నింటి సుశీల, నూతనగంటి కుమారస్వామి, వన్నాల రమ, చిరుపాటి సారయ్య, మొగిలి, మేర్గు శోభ తదితర బాధితులు మొరపెట్టుకున్నారు. తమకు ఇందిరమ్మ పక్కా గృహాలను మంజూరు చేయాలని కోరారు. కాగా ఈ విషయంపై విచారణ జరిపి తగిన విధంగా న్యాయం జరిగేలా చూస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. అలాగే, భూభారతిలో భాగంగా రైతుల నుంచి వచ్చిన పలు దరఖాస్తులతో పాటు గ్రామానికి చెందిన రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

వరంగల్ చౌరస్తా/వరంగల్/చెన్నారావుపేట, మే 12 : ఏళ్ల తరబడి పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు కోడ్‌లు మార్చిన కేంద్ర ప్రభుత్వంపై దేశవ్యాప్తంగా ఈ నెల 20న చేపట్టిన సమ్మెను ప్రతి కార్మికుడు విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేశ్ పిలుపునిచ్చారు. సోమవారం వరంగల్ శివనగర్ తమ్మెర భవన్‌లో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు, వర్కింగ్ ప్రెసిడెంట్ దండు లక్ష్మణ్, సహాయ కార్యదర్శులు సంఘి ఎలేందర్, తాళ్లపల్లి జాన్‌పాల్, నల్లతీగల కుమార్, నాగవెల్లి శంకర్, జన్ను రాజు, యాకయ్య, రాధ, మల్లికాంబ, శాంతి, కవిత పాల్గొన్నారు. అలాగే, దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సీఐటీయూ జిల్లా కోశాధికారి సింగారపు బాబు ఆధ్వర్యంలో గ్రేటర్ కార్పొరేషన్ ఆవరణలో పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు జన్ను ప్రకాశ్, ఓరుగంటి జీవన్, సింగారపు కృష్ణ, బొజ్జ రాజు, నాగెల్లి కుమార్, శనిగరపు కిరణ్, సాంబయ్య, కొమ్ము దాసు, శివ, భిక్షపతి పాల్గొన్నారు. అలాగే, చెన్నారావుపేటలో సీఐటీయూ నాయకుడు జన్ను రమేశ్ ఆధ్వర్యంలో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి అశోక్, దూడయ్య, రాజు, రవి, తిరుపతి, సాయి చందు, పాషా, రాజు పాల్గొన్నారు.


పెద్ది సుదర్శన్‌రెడ్డిని సత్కరిస్తున్న ఆలయ బాధ్యులు

## ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని కలిగి ఉండాలి

**మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి**

నర్సంపేట, మే 12 : ప్రజలందరూ భక్తిభావాన్ని కలిగి ఉండాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని సర్వాపురంలో హనుమాన్ ఆలయంలో మహాయాగ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ముందుగా అర్చకులు పూర్ణాహుతితో మాజీ ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో పెద్ది ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, ప్రధాన కార్యదర్శి వేనుముద్దల శ్రీధర్‌రెడ్డి, పోతిరెడ్డి నర్సింహారెడ్డి, కూచన రాజు, బుద్దె లక్ష్మీనారాయణ, దుబ్బాక నర్సింహారెడ్డి, ఎర్రబెల్లి మల్లయ్య, బోలువడ్డు కుమార్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కూడా కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

నర్సంపేట, మే 12 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీపీఎం నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు కోరబోయిన కుమారస్వామి, హన్మకొండ శ్రీధర్, ముంజాల సాయిలు, నాయకులు అక్కపెల్లి సుధాకర్, గడ్డమీది బాలకృష్ణ, కందికొండ రాజు, దాసరి నరేశ్, నర్సింహారాములు పాల్గొన్నారు.


నర్సింగ్ ఆఫీసర్లకు అభినందనలు తెలియజేస్తున్న కిశోర్‌కుమార్

## వైద్యరంగంలో నర్సింగ్ ఆఫీసర్ల సేవలు కీలకం

వరంగల్ చౌరస్తా, మే 12 : వైద్యరంగంలో నర్సింగ్ ఆఫీసర్ల సేవలు కీలకమైనవని ఎంజీఎం హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్‌కుమార్ అన్నారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని పురస్కరించుకొని సోమవారం ఎంజీఎం హాస్పిటల్‌లో ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కిశోర్‌కుమార్ హాజరై చీఫ్ నర్సింగ్ సూపరింటెండెంట్ కే దయాశీలను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్‌ఎంవో డాక్టర్ శశికుమార్, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్లు తిరుమల దేవి, నళిని, దీప్తి, పద్మలత, నాగలక్ష్మి, సునీత, సుధావాణి, నిర్మల, మేరి, జూనియర్ నర్సింగ్ ఆఫీసర్లు శివపార్వతి, సుజీవన్, సందీప్, అనిల్, పద్మవందన, గీత, ప్రమీల, మంజుల పాల్గొన్నారు.


కొవ్వొత్తులతో అమర జవాన్లకు నివాళులర్పిస్తున్న కాలనీవాసులు

## భారత జవాన్లకు సెల్యూట్

కరీమాబాద్, మే 12: దేశం కోసం పోరాటం చేసే జవాన్ల త్యాగాలు మరువలేనివని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. ఆదివారం రాత్రి రంగశాయిపేటలోని ముకుంద కాలనీలో అమర జవాన్లకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మరుపల్ల రవి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు విడిచిన వారి కుటుంబాలకు మనమంతా అండగా ఉండాలన్నారు.

## దళితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

ఖిలావరంగల్, మే 12 : ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ దళితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సంఘీ ఎలేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఖిలా వరంగల్ తహసీల్దార్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో దళితులకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. జన్ను రవి, జాన్‌పాల్, రాజేందర్, హరిబాబు, నవీన్, సునీత, నర్సింగారావు, జానకమ్మ పాల్గొన్నారు.